క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 17న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. భవాని నగర్, హౌజింగ్ బోర్డు కాలనీ, ఇందిరానగర్, వడ్డెపల్లి, విజయపాల్ కాలనీ, రాఘవేంద్ర కాలనీ -2 ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు రైల్వే జీఎం శ్రీవాస్తవ రాక

కాజీపేట రూరల్: కాజీపేట మండలం అయోధ్యపురం శివారు పరిధిలో నిర్మిస్తున్న రైల్ మ్యాన్‌ఫ్యాక్చరింగ్ యూనిట్ (రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, వ్యాగన్‌షెడ్)ను దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ గురువారం సందర్శించి తనిఖీ చేయనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఈ నెల 19వ తేదీన రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ కాజీపేట రైల్ మ్యాన్‌ఫ్యాక్చరింగ్ యూనిట్ నిర్మాణ పనులను తనిఖీ చేయడానికి వస్తున్న నేపథ్యంలో భాగంగా ముందస్తుగా రైల్వే జీఎం తనిఖీ నిమిత్తం వస్తున్నట్లు పేర్కొన్నారు.

ఎంసీపీఐ (యూ) జిల్లా కార్యదర్శివర్గ సభ్యుల ఎన్నిక

ఖిలా వరంగల్: ఎంసీపీఐ (యూ) వరంగల్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులుగా మాలోతూ సాగర్, ముక్కెర రామస్వామి, జిల్లా కమిటీ సభ్యులుగా మాలోతు ప్రత్యూష, జి.ఓదెలు, తాటికాయల రత్నం, సింగారపు దాసు, ఎండీ.అబ్బు ఎన్నికయ్యారు. ఈ మేరకు బుధవారం జరిగిన సమావేశంలో పార్టీ జాతీయ కార్యదర్శి మద్దికాయల అశోక్ చేతుల మీదుగా వారు నియామక పత్రాలు అందుకున్నారు.

మత్స్యకారుల సంఘం ఎన్నిక



కాజీపేట / కాజీపేట రూరల్: మత్స్యకారుల సంఘం కాజీపేట మండల అధ్యక్షురాలిగా సమ్మక్క, కార్యదర్శిగా నీలం భానుచందర్‌తో పాటు 12 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. కాజీపేట పట్టణంలో తెలంగాణ మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం మండల మహాసభను జిల్లా ప్రధాన కార్యదర్శి గొడుగు వెంకట్ బుధవారం ప్రారంభించారు. పట్టణంలోని బాపూజీనగర్ ప్రధాన రహదారిపై చేపలు విక్రయిస్తున్న స్థలంలో రూ.10లక్షల వ్యయంతో మార్కెట్ నిర్మించాలని కోరుతూ మహాసభ ఏకగ్రీవ తీర్మానాన్ని ఆమోదించింది. సమావేశంలో దువ్వ సదానందం, కుక్కల రాజమణి, కొంతం సమ్మక్క, ముప్పారపు సమ్మక్క, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

డీఈ ముజమిల్‌కు సన్మానం

ఖిలా వరంగల్: వరంగల్ మహానగర పాలక సంస్థ ఏఈగా విధులు నిర్వహించి ఇటీవల డీఈగా ప్రమోషన్‌పై వరంగల్ పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్‌కు బదిలీపై వెళ్లిన ముజమిల్‌ను పలువురు బుధవారం సన్మానించారు. కార్యక్రమంలో 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి, మహానగర పాలక సంస్థ ఏఈ సుకృత, వర్క్ ఇన్‌స్పెక్టర్లు గుమ్మడి సుధాకర్, శ్రీనివాసరావు వసుకుల మహేష్ పాల్గొన్నారు.

విద్యార్థిని మృతి కారకులను కఠినంగా శిక్షించాలి

హన్మకొండ: ఒడిశాలోని బాలేశ్వర్‌లో విద్యార్థిని సౌమ్యశ్రీ మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఆమె ఆత్మకు శాంతి చేకూర్చాలని కోరుతూ బుధవారం రాత్రి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు, ఉమ్మడి వరంగల్ జిల్లా కన్వీనర్ ఆరెపల్లి సుజిత్, హనుమకొండ జిల్లా కన్వీనర్ పరిచర, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న టీటీడీ ధార్మిక ఆధ్యాత్మిక కార్యక్రమాలు

హన్మకొండ కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. రెండో రోజు బుధవారం సాయంత్రం హనుమకొండ భవానీనగర్‌లోని భవానీమాత దేవాలయంలో విజయవాడకు చెందిన మండలిక కృష్ణకుమార్.. వెంకటాచల మహాత్మ్యంపై ధార్మిక ప్రవచనాలు చేశారు. కార్యక్రమంలో టీటీడీ కార్యక్రమ నిర్వాహకుడు రామిరెడ్డి కృష్ణమూర్తి, ఆలయ కమిటీ అధ్యక్షుడు గుడి లక్ష్మారెడ్డి, ఉపాధ్యక్షుడు మురళీధర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు కిట్ల పంపిణీ

హన్మకొండ చౌరస్తా: హనుమకొండ 10వ డివిజన్‌లోని పారిశుద్ధ్య కార్మికులకు ఆరోగ్య రక్షణ కిట్లను కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర పరిశుభ్రత, పచ్చదనంలో పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు కుమార్‌యాదవ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేందర్, జవాన్లు బొచ్చు సదానందం, వైనాల బాబు, బొజ్జ శ్యామ్ పాల్గొన్నారు.

నిరుపయోగం

- అలంకారప్రాయంగా ట్రాఫిక్ సిగ్నల్ పాయింట్
- నెలలు గడుస్తున్నా ప్రారంభోత్సవానికి నోచుకోని వైనం
- న్యూశాయంపేటలో ట్రాఫిక్ ఇబ్బందులు



ప్రారంభం కాని ట్రాఫిక్ సిగ్నల్ పాయింట్

కాజీపేట అర్బన్: కాజీపేట మండలం న్యూశాయంపేట చౌరస్తాలో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ కంట్రోల్ సిగ్నల్ పాయింట్ అలంకారప్రాయంగా మారింది. హంటర్‌రోడ్డులోని న్యూశాయంపేట చౌరస్తా మీదుగా కాజీపేట, వరంగల్, హనుమకొండ, పద్మాక్షి కాలనీ నుంచి న్యూశాయంపేట గ్రామంలోకి నాలుగు మార్గాల్లో నిత్యం వేలాది మంది ప్రయాణాలు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ క్రమంలో రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నియంత్రణకు సిగ్నల్ పాయింట్ ఏర్పాటు చేశారు. అయితే, దాన్ని ప్రారంభించకుండా అధికారులు జాప్యం చేస్తున్నారని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తప్పని ట్రాఫిక్ తిప్పలు

న్యూశాయంపేట చౌరస్తా మీదుగా ప్రయాణించే వాహనదారులకు ట్రాఫిక్ తిప్పలు తప్పడం లేదు. ప్రమాదాల నియంత్రణకు ఏర్పాటు చేసిన సిగ్నల్ కంట్రోల్ పాయింట్‌ను ప్రారంభించకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాహనాల దూకుడుకు కళ్లెం వేసేందుకు తోడ్పడుతుందనుకున్న ట్రాఫిక్ సిగ్నల్ పాయింట్‌ను ప్రారంభించకపోవడంతో కొంతమంది వాహనదారులు ఇష్టారీతిన, మితిమీరిన వేగంతో వెళ్తున్నారు. దాంతో పాదచారులు, విద్యార్థులు, వృద్ధులు రోడ్డు దాటలేకపోతున్నారు.

ట్రాఫిక్ సిగ్నల్ పాయింట్‌ను ప్రారంభించాలి



నిత్యం రద్దీగా ఉండే న్యూశాయంపేట చౌరస్తాలో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్ పాయింట్‌ను వెంటనే ప్రారంభించాలి. కొంతమంది వాహనదారులు అతివేగం, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనతో చాలా మంది రోడ్డు ప్రమాదాల బారిన పడుతున్నారు. సిగ్నల్ వ్యవస్థ అందుబాటులోకి వస్తే వాహనాల వేగానికి కళ్లెం వేయవచ్చు.

- కుసుమ శ్యాంసుందర్, న్యూశాయంపేట

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి



సభ్యత్వ నమోదులో పాల్గొన్న కిరణ్‌కుమార్

హసన్‌పర్తి: రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు కిరణ్‌కుమార్ డిమాండ్ చేశారు. హసన్‌పర్తి మండలంలోని పలు పాఠశాలల్లో యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులకు అందాల్సిన పెన్షన్ బెనిఫిట్స్ వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ఐదు విడుదల కరవు భత్యం విడుదల చేసి, పీఆర్‌సీ నివేదికను అమలు చేయాలని సూచించారు. యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు మాట్లాడుతూ సీపీఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేసి, గురుకుల పాఠశాలల పనివేళలను మార్చాలని కోరారు. కేజీబీవీలో పనిచేస్తున్న మహిళా ఉపాధ్యాయులకు వెంటనే మినిమం టైం స్కేల్ అమలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ హసన్‌పర్తి మండల అధ్యక్షురాలు శోభారాణి, ప్రధాన కార్యదర్శి నరేష్, ఉపాధ్యక్షురాలు పి.రమాదేవి, కార్యదర్శి వెంకట రమణారెడ్డి, పెద్దమ్మ నాగరాజు పాల్గొన్నారు.

‘ప్రొఫెసర్ల’ సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్లు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో కొన్నేళ్లుగా పనిచేస్తున్న కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ల సమస్యలు పరిష్కరించాలని కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు కోరారు. ఈ మేరకు కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రం బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లకు వచ్చేనెల నుంచి పే స్లిప్పులు, సర్వీస్ నోటిఫికేషన్, పీహెచ్‌డీ గైడ్‌షిప్‌లు ఇవ్వాలని కోరారు. అకాడమిక్ మెటర్నటీ సెలవులు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందజేయాలని సూచించారు. హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, యూనివర్సిటీ పీజీ కళాశాలల్లో డిపార్టుమెంట్ ఇన్‌చార్జ్‌లుగా పనిచేస్తున్న వారిని డిపార్టుమెంట్ సమావేశాలకు ఆహ్వానించాలన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని రిజిస్ట్రార్‌కు అందజేశారు. కార్యక్రమంలో కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ సతీష్, డాక్టర్ సాదు రాజేష్, మాదాసి కనకయ్య, నాగయ్య, బ్రహ్మం, జూల సత్య, అరూరి సూర్యం, సాయిచరణ్, రమాదేవి పాల్గొన్నారు.

రాంపూర్ గ్రామాభివృద్ధికి కృషి



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, మేయర్

మడికొండ: 46వ డివిజన్ పరిధిలోని రాంపూర్ గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. ఈమేరకు పలు అభివృద్ధి పథకాలకు మేయర్ గుండు సుధారాణితో కలిసి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీహరి మాట్లాడుతూ గ్రామంలో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించనున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డు వచ్చేలా చూస్తానన్నారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ప్రజలను కోరారు. స్టేషన్ పెండ్యాల, రాంపూర్‌లో శ్మశాన వాటికల కోసం నిధులు మంజూరు చేయాలని మేయర్‌కు ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మునిగాల సరోజన, నాయకులు రవి, సంద్ర కుమార్, సదానందం, దేవేందర్‌రావు, కరుణాకర్, దాసు, నాయకులు పాల్గొన్నారు.

కేడీసీకి తెలుగు గ్రంథాల వితరణ



తెలుగు భాషా గ్రంథాలను ప్రదర్శిస్తున్న అధ్యాపకులు

విద్యారణ్యపురి: హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు అధ్యాపకుడిగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన నర్సింహారావు తెలుగు భాషా గ్రంథాలను కేడీసీ లైబ్రరీకి బుధవారం వితరణ చేశారు. అమూల్యమైన తెలుగు భాషా గ్రంథాలను ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీనివాస్ చేతుల మీదుగా లైబ్రరీకి నర్సింహారావు అందజేశారని కళాశాల లైబ్రేరియన్ డాక్టర్ భరత్ తెలిపారు.

ఎమ్మెల్యే వ్యాఖ్యలను ఖండిస్తున్నాం

ఎంజీఎం: నకిలీ వైద్యుల సమావేశంలో పాల్గొని, చట్టవ్యతిరేకంగా వారు చేస్తున్న వైద్యసేవలకు మద్దతిస్తూ మాట్లాడిన కరీంనగర్ జిల్లా మానుకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలంగాణ హాస్పిటల్స్ అండ్ నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్ (థానా) వరంగల్ బాధ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతినిధిగా, వైద్య వృత్తికి చెందిన వ్యక్తిగా ఆయన చేసిన వ్యాఖ్యలు చెడు సంకేతాన్ని సూచిస్తాయని పేర్కొన్నారు. తెలంగాణ మెడికల్ కౌన్సిల్ (టీజీఎంసీ) అర్హత లేకుండా వైద్యం చేస్తున్న వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్న సందర్భంలో ఇలాంటి వ్యాఖ్యలు చేయడం చాలా బాధాకరమని తెలిపారు. బాధ్యతారాహిత్యంగా మాట్లాడిన ఎమ్మెల్యే సత్యనారాయణపై సీఎం రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకొని క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

సీపీని కలిసిన ఏసీపీ

హసన్‌పర్తి: సైబర్ క్రైం ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన గిరిష్‌కుమార్ బుధవారం పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీపీకి బొకే అందజేశారు.

మధ్యాహ్న వంట బకాయిలు చెల్లించాలి



డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

విద్యారణ్యపురి: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ సీఐటీయూ హనుమకొండ జిల్లా కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు హనుమకొండ డీఈఓ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవ అధ్యక్షురాలు నిడిగొండ రజిత మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు పనిభద్రత కల్పించాలని, రావాల్సిన బకాయిల బిల్లులు చెల్లించాలని కోరారు. కనీసం వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సూచించారు. అనంతరం డీఈఓ వాసంతికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి శాంత, పర్వీన్, లక్ష్మి, సునీత, మమత, జియా, రేవతి పాల్గొన్నారు.

పిల్లలతో పనులు చేయిస్తే చర్యలు



సదస్సులో మాట్లాడుతున్న వసుధ

వరంగల్ చౌరస్తా: 18 ఏళ్లలోపు పిల్లలతో పనులు చేయిస్తే కఠిన చర్యలు ఉంటాయని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్ పర్సన్ వసుధ హెచ్చరించారు. వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో చాంబర్ ఆఫ్ కామర్స్ చిల్లి సెక్షన్ వ్యాపారులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలల చట్టాలపై వ్యాపారులు అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రభుత్వం, దాతల సహకారంతో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో పాఠశాలలు, బేబీ కేర్ సెంటర్లు, అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. సమావేశంలో జిల్లా మార్కెటింగ్ అధికారి సురేఖ, సీఐ శ్యాంసుందర్, అధికారులు సంతోష్ కుమార్, మిర్చి సెక్షన్ కార్యదర్శి సురేందర్, వ్యాపారస్తులు సాంబయ్య, వెంకటేశ్వర్లు, ఎన్‌జీఓ సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు.

బల్దియా స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలి



స్థల పత్రాలను అందజేస్తున్న కార్పొరేటర్

వరంగల్ చౌరస్తా: వరంగల్ 27 డివిజన్‌లోని లక్ష్మీపురం కూరగాయల మార్కెట్ సమీపంలో సర్వే నంబర్ 9, ప్లాట్ నంబర్ 63లోని స్థలం బల్దియాకు చెందినదని, దాన్ని స్వాధీనం చేసుకోవాలని స్థానిక కార్పొరేటర్ చింతాకుల అనిల్, స్థానికులు కోరారు. ఈ మేరకు కబ్జాకు గురవుతున్న ఆ స్థలాన్ని బల్దియా ఇన్‌చార్జ్ సిటీ ప్లానర్ రవీందర్ వాడేకర్, ఏసీపీ ఖలీలొద్దీన్, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ నరేందర్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా దళిత బహుజనులకు ఉపయోగపడే విధంగా కమ్యూనిటీ హాల్ నిర్మించాలని అధికారులను స్థానికులు కోరారు. ఆ స్థలానికి సంబంధించిన పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మీసాల ప్రకాశ్, బాషపాక సదానందం, కొమ్ము రాజకుమార్, మంద శ్రీను, విశాల్, సుధాకర్, రాజేష్, మహేష్, రవి, సాగర్, చారిబాయి, అమర్, రమేష్, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

వైద్య కళాశాలకు శరీర దానం



సర్టిఫికెట్ అందజేస్తున్న కేఎంసీ ప్రిన్సిపాల్ సంధ్య

ఎంజీఎం: నగరంలోని బాలసముద్రానికి చెందిన కొమరాజు హేమలత (90) అనారోగ్యంతో మరణించగా, ఆమె మృతదేహాన్ని కుమారుడు డాక్టర్ రవిశంకర్, ఉదయశంకర్, గిరిజా శంకర్ అనుమతితో తెలంగాణ నేత్ర, అవయవ, శరీర దాతల అసోసియేషన్ ఆధ్వర్యంలో కాకతీయ మెడికల్ కళాశాల సిబ్బందికి బుధవారం అప్పగించారు. ఈ సందర్భంగా కేఎంసీ ప్రిన్సిపాల్ సంధ్య మాట్లాడుతూ మరణానంతరం శరీర దానం.. భావి వైద్యులకు వైద్యవిద్య అధ్యయనం, శాస్త్ర పరిశోధన, సర్జరీ నేర్చుకోవడానికి ఎంతో ఉపయోగపడుతుందని వివరించారు. ఈ సందర్భంగా శరీర దానం చేసి కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలిపి సర్టిఫికెట్ అందజేశారు. మరణానంతరం నేత్ర, అవయవ, శరీర దానానికి తెలంగాణ నేత్ర, అవయవ, శరీర దాతల అసోసియేషన్‌ను సంప్రదించాలని అసోసియేషన్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు కోన్‌రెడ్డి మల్లారెడ్డి తెలిపారు. మరిన్ని వివరాలకు 87905 48706, 94901 33650 నంబర్లలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో మృతురాలి బంధు మిత్రులు, అసోసియేషన్ వరంగల్ ఉపాధ్యక్షురాలు మునిగాల పద్మ, సెక్రటరీ అనంతుల కేదారి, ట్రెజరరీ రాములు, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మైసమ్మతల్లి బోనాలు



బోనం ఎత్తిన రాజుతో కార్పొరేటర్, భక్తులు

ఖిలా వరంగల్: ఆషాఢ మాసం సందర్భంగా 40వ డివిజన్ కరీమాబాద్ ఉర్సు ప్రతాప్‌నగర్‌లో ప్రధాన పూజారి, శివసత్తు రాజు ఆధ్వర్యంలో మైసమ్మ బోనాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో శివసత్తుల పూనకాలు, డప్పు చప్పులతో ఆ ప్రాంతమంతా మారుమోగింది. మహిళలు నెత్తిన బోనం ఎత్తుకొని మైసమ్మ తల్లి ఆలయానికి బయలుదేరి వెళ్లి నైవేద్యం సమర్పించారు. వేడుకల్లో కార్పొరేటర్ మరుపల్ల రవి, మైసమ్మ కమిటీ అధ్యక్షుడు గుడిమల్ల మోహన్, కసుకుంట్ల రవి, గుడిమళ్ల వేదప్రకాష్, మాటేటి సంపత్, వెంకటేశ్వర్లు, మైసమ్మ ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తైక్వాండో కోచ్ కుటుంబానికి చేయూత



చెక్కు అందజేస్తున్న బాధ్యులు, క్రీడాకారులు

వరంగల్ స్పోర్ట్స్: ఇటీవల గుండెపోటుతో మృతిచెందిన వరంగల్ తైక్వాండో సంఘం జిల్లా కార్యదర్శి, సీనియర్ కోచ్ వావిలాల సారంగపాణి కుటుంబానికి రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన ఆయన శిష్యులు ఆర్థిక చేయూతను అందజేశారు. సీనియర్ క్రీడాకారులు సమష్టిగా సేకరించిన రూ.1,12,101 మొత్తాన్ని వరంగల్ కాశిబుగ్గలోని స్వగృహంలో మృతుడి భార్య విజయ, కుమారుడు నరసింహ, కూతురు సంకీర్తనకు చెక్కును బుధవారం అందజేశారు. కార్యక్రమంలో ఒలింపిక్స్ సంఘం జిల్లా కార్యదర్శి బైరబోయిన కైలాస్, తైక్వాండో సంఘం జిల్లా అధ్యక్షుడు ఎల్లావుల కుమార్, తెలంగాణ పారా తైక్వాండో సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎల్లావుల గణేష్‌యాదవ్, సీనియర్ క్రీడాకారులు గౌతమ్‌యాదవ్, భాస్కర్, దిలీప్, రమేష్, రాంబాబు, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గోరింటాకు వేడుకలు



వేడుకల్లో అధ్యాపకులు, విద్యార్థినులు

ఖిలా వరంగల్: ఆషాఢ మాసం సందర్భంగా వరంగల్ రంగశాయిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వరంగల్ మహిళా సాధికారిత విభాగం అధికారుల ఆధ్వర్యంలో మెహందీ (గోరింటాకు) వేడుకలను బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఆర్.ప్రేమలత వేడుకలను ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థినులు గోరింటాకు పెట్టుకోవడం వల్ల శరీరం చల్లబడి ఆరోగ్యపరమైన మేలు జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో మహిళా సాధికారిత సభ్యులు సుస్మిత, కృష్ణవేణి, ఫాతిమా, సునీత, రాధ, అధ్యాపకులు మూర్తి, పరమేష్, మినజొద్దీన్, రమేష్, భగీరథ, తదిరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

మహానగరాన్ని ఒకే జిల్లాగా మార్చండి



నయీంనగర్: చారిత్రక నగరంగా ఉన్న వరంగల్ మహానగరాన్ని హనుమకొండ, వరంగల్ జిల్లాలుగా విభజించి అభివృద్ధిని కుంగదీశారని, రెండు జిల్లాల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని వరంగల్, హనుమకొండ జిల్లాలను కలిపి వరంగల్ జిల్లాగా మార్చాలని తెలంగాణ ఉద్యమకారుల వేదిక రాష్ట్ర చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ కోరారు. రెండు జిల్లాల ప్రజా సంఘాల ఆధ్వర్యంలో హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో బుధవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే హైదరాబాద్ మాదిరి వరంగల్ మహానగరంగా అతిపెద్ద అభివృద్ధి కేంద్రంగా ఏర్పడుతుందని నిరుద్యోగులు, విద్యార్థులు, ఉద్యోగులు, శ్రమజీవులు ఆశించగా, అలా జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఫోరం ఫర్ బెటర్ వరంగల్ అధ్యక్షుడు పుల్లూరి సుధాకర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం సాధించుకున్న వరంగల్ ప్రజలకు మిగిలింది ఏమిటో ఆలోచించాలని కోరారు. సమావేశంలో సోమ రామమూర్తి, సాయిని నరేందర్, బొమ్మినేని బాపిరెడ్డి, బట్టి శ్యామ్ యాదవ్, బాబురావు, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

కేయూ విద్యా కళాశాలలో ఆందోళన



కేయూ క్యాంపస్: తమ సమస్యలు పరిష్కరించాలని కాకతీయ యూనివర్సిటీలోని విద్యా కళాశాలలో ఎంఈడీ, బీఈడీ విద్యార్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కళాశాలలో బుధవారం సాయంత్రం నుంచి రాత్రి 8.30 గంటల వరకు ఆందోళన వ్యక్తం చేశారు. రిజిస్ట్రార్ రామచంద్రం అక్కడికి చేరుకుని మాట్లాడుతూ అధ్యాపకులతో సమావేశమై, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యా కళాశాలకు రెగ్యులర్ ప్రిన్సిపాల్‌ను నియమించాలని కోరారు. కాంట్రాక్టు, గెస్ట్ ఫ్యాకల్టీతో విద్యాబోధన సరిగా జరగడం లేదని ఆరోపించారు. మారుతున్న విద్యకు అనుగుణంగా డిజిటల్ విద్యను అందించేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు పేర్కొన్నారు.

గణపతి దీక్షల తేదీల ఖరారు

కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో గణపతి దీక్షల తేదీలను పాలక మండలి సభ్యులు బుధవారం ఏకగ్రీవంగా ఖరారు చేశారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు అయిన వోలు వెంకటేశ్వర్లు శర్మ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి గణపతి నవరాత్రులతో పాటు దీక్షలు తేదీలను నిర్ణయించారు. గణపతి దీక్షలు మండల 42 రోజులు, 21, 16, 11 రోజుల దీక్షలను స్త్రీ, పురుషులతో పాటు అన్ని వయస్సుల వారు స్వీకరించవచ్చని పేర్కొన్నారు. జూలై 26న మండల దీక్షలు, ఆగస్టు 16న అర్ధ మండల దీక్షలు, 21న షోడశ దీక్షలు, 26న ఏకాదశ దీక్షలు తీసుకోవాలని భక్తులకు సూచించారు. సెప్టెంబర్ 6న ఇరుముడి ధారణ, దీక్షల విరమణ ఉంటుందని తెలిపారు. సమావేశంలో కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్, ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకుడు సాయికృష్ణశర్మ, ఆలయ మేనేజర్ రవి, దేవులపల్లి సదానందం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

24న క్రైస్తవ సమితి వార్షికోత్సవం

న్యూశాయంపేట: ఈ నెల 24న హనుమకొండ సెంటినరీ బాప్టిస్ట్ చర్చిలో జరగనున్న క్రైస్తవ హక్కుల పరిరక్షణ సమితి ప్రథమ వార్షికోత్సవానికి వేలాదిగా తరలిరావాలని సమితి నేషనల్ ఉపాధ్యక్షుడు, వరంగల్ జిల్లా అధ్యక్షుడు రెవ డాక్టర్ జూపాక యాకోబు పిలుపునిచ్చారు. 3వ డివిజన్ పైడిపల్లి లెబనాన్ చర్చిలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్రైస్తవులు ఐక్యంగా ఉండి తమ హక్కుల సాధనకు ముందుకు సాగాలని సూచించారు. ఈ సందర్భంగా వార్షికోత్సవానికి సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో హక్కుల సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బిషప్ జన్ను ఇర్మియా, స్థానిక కార్పొరేటర్ జన్ను షీబారాణి, మాజీ కార్పొరేటర్లు బోడ డిన్న, వీర భిక్షపతి, నాయకులు మాట్ల రాజు, జన్ను ఏసన్న, చందుప్రసాద్, ఏ.పాల్, సుదర్శన్, ప్రసంగి, ఆగయ్య, సుధాకర్ పాల్, ఆరోగ్యం, శోభన్, శ్రీను, మల్లేషం, కుమార్, టింకు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఖిలా వరంగల్: మధ్యకోట యాదవవాడకు చెందిన అడ్తి వ్యాపారి వేల్పుల సంతోష్‌యాదవ్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు బాధిత కుటుంబ సభ్యులను వరంగల్ అర్బన్ కో ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్, బీజేపీ నేత ఎర్రబెల్లి ప్రదీప్‌రావు బుధవారం పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట స్థానిక మాజీ కార్పొరేటర్ బైరబోయిన దామోదర్‌యాదవ్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కందిమల్ల మహేష్, జిల్లా కార్యదర్శి మందా శ్రీనివాస్, అర్జున్, అంకాల జనార్దన్, ఇనుముల అరుణ్, గొర్రె కోటి, తీగల అమర్, గోల రాజ్‌కుమార్, తాళ్లపల్లి రమేష్, ఇనుముల రాజు, హరీష్, మున్నా, తదితరులు పాల్గొన్నారు.

ఒగ్గు కళాకారుల సమస్యలు పరిష్కరించాలి

నయీంనగర్: ఒగ్గు జానపద కళాకారుల సమస్యలు పరిష్కరించాలని జానపద కళాకారుల సంఘం ప్రతినిధులు కోరారు. ఈ మేరకు సాంస్కృతిక మండలి రాష్ట్ర చైర్ పర్సన్ డాక్టర్ జి.వెన్నెలకు నగరంలో హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం వినతిపత్రం అందజేశారు. ఒగ్గు జానపద కళాకారుల సంఘం హనుమకొండ జిల్లా సలహాదారు కాడబోయిన లింగయ్య పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

విద్యారణ్యపురి: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు భీమారం వద్ద బుధవారం నిరసన తెలిపారు. ఈ విషయమై సీఎం రేవంత్‌రెడ్డికి పోస్టుకార్డులు పంపుతున్నట్లు పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వంశీకృష్ణ, రంజిత్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ముషారఫ్, పృథ్వీ, హర్షిత్ పాల్గొన్నారు.

నిధులు కేటాయించాలి

హసన్‌పర్తి: 66వ డివిజన్ ఛత్రపతి కాలనీ అభివృద్ధికి నిధులు కేటాయించాలని స్థానికులు కోరారు. ఈ మేరకు వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజును బుధవారం కలిసి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో కాలనీ కమిటీ సభ్యుడు సట్కూరి సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటాలి

హసన్‌పర్తి: స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు డాక్టర్ బండి రజనీకుమార్ పిలుపునిచ్చారు. హసన్‌పర్తి మండలం మడిపల్లిలో జరిగిన బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆత్మ మాజీ చైర్మన్ కందుకూరి చంద్రమోహన్, మడిపల్లి గ్రామ ఇన్‌చార్జ్ అటికం రవీందర్, మాజీ సర్పంచ్ రాణి, తదితరులు పాల్గొన్నారు.

7 ఇసుక ట్రాక్టర్ల సీజ్

వరంగల్ చౌరస్తా: వర్ధన్నపేట ల్యాబర్తి వాగులో అక్రమంగా తవ్వకాలు చేపడుతూ ఇసుక తరలిస్తున్న 7 ఇసుక ట్రాక్టర్లను బుధవారం సీజ్ చేసినట్లు ఇంతేజార్ గంజ్ పోలీసులు తెలిపారు. మండలంలోని కట్ర్యాల గ్రామానికి చెందిన కోటగిరి శోభన్, రసూరి రాజ్‌కుమార్, కమాండ్ల లింగయ్య, కరీంపాషా, బైరి రాజు, యాకూబ్, చంద్రగూడెంకు చెందిన పిల్లి రవికుమార్, జమాండ్లపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు వివరించారు.

గంజాయి విక్రయదారు అరెస్ట్

వరంగల్ చౌరస్తా: అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓ విద్యార్థిని బుధవారం అదుపులోకి తీసుకుని విచారించగా, అతని వద్ద గంజాయి లభించడంతో అరెస్టు చేసినట్లు వరంగల్ ఇంతేజార్ గంజ్ పోలీసులు తెలిపారు. వరంగల్ ఎల్‌బీనగర్ చెందిన ఆ విద్యార్థి వద్ద 170 గ్రాముల గంజాయి దొరకగా, అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వారు వివరించారు.